క్లుప్తంగా

అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

యానాం: పుదుచ్చేరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారాన్ని అందించాలని సీఎం రంగసామి కోరారు. శనివారం కేంద్ర క్రీడల మంత్రి మాండవ్య ఆధ్వర్యంలో ఓ బృందం అసెంబ్లీ కాంప్లెక్స్‌లో సీఎం రంగసామిని కలిసారు. అనంతరం రంగసామి మాట్లాడారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా నిధులు మంజూరు తదితర అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి రాధాకృష్ణన్, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా, హోం మంత్రి నమశ్శివాయం, ఆది ద్రావిడ శాఖ మంత్రి సాయిశర్వణన్, ఎమ్మెల్యే కల్యాణ సుందరం, రామలింగం, వెంకటేషన్, అశోక్‌బాబు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాళ్లరేవు: ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ కోరారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా సమ్మె సన్నాహక సదస్సుకు శేషుబాబ్జీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, వి. రాజబాబు, నాగలక్ష్మి, శ్రీదేవి తదితరులు మాట్లాడారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు

ముమ్మిడివరం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిసాయి. డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో శిబిరం ముగింపు సమాశం నిర్వహించారు. అనంతరం ఈనెలలో పదవీ విరమణ పొందనున్న తెలుగు ఉపాధ్యాయుడు పచ్చిమాల శివనాగ రాజును ఘనంగా సత్కరించారు. క్యాంపు నిర్వహణ కోఆర్డినేటర్ గోపాలకృష్ణ, గోడి శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గారావు, సూర్యనారాయణ, రమేష్, అర్జునరావు, హిమబిందు, భవానీ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

తాళ్లరేవు: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో పదిరోజులపాటు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం శనివారంతో ముగిసింది. ఈ క్యాంపులో చిన్నారులు పలు అంశాల్లో శిక్షణ పొందడంతోపాటు పలు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముగింపు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.

పునీత జోజప్ప దేవాలయానికి శంకుస్థాపన



నూతన దేవాలయానికి శంకుస్థాపన చేస్తున్న జయరావు పాలిమెర

అమలాపురం రూరల్: కామనగరువు కరక్కాయపేటలో పునీత జోజప్ప నూతన దేవాలయానికి ఏలూరు జిల్లా పీఠం కాపరి డాక్టర్ జయరావు పొలిమెర శంకుస్థాపన చేశారు. పాస్టర్ నత్త పాల్ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ నూతన దేవాలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీముడు, నాయకులు కుంచె రమణారావు, ఇసుకపట్ల రఘు బాబు, అజయ్‌బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో వస్తువుల ధ్వంసంపై కేసు నమోదు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ఆశానగర్‌కు చెందిన టేకు దీప ఇంట్లో టీవీ, మంచం తదితర వస్తువులను ధ్వంసం చేసిన నేరంపై ఆమె సమీప బంధువు దువ్వ చిన్నపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. కుటుంబ తగదాలకు దీప కారణమన్న అక్కసుతో చిన్న శుక్రవారం రాత్రి దాడి చేశాడు. దీప ఇంట్లోకి దౌర్జన్యంగా వెళ్లి వస్తువులను ధ్వంసం చేశాడని ఎస్సై చెప్పారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్ బాబు తెలిపారు.

కళ్లాల్లోనే ధాన్యం.. కర్షకులకు కష్టకాలం

- అన్నదాతలకు ప్రభుత్వ సహకారం కరువు
- వాతావరణ మార్పులతో బెంబేలెత్తుతున్న రైతన్నలు
- ఇదే అదునుగా దోచుకుంటున్న దళారులు
- తేమ శాతం సాకు చూపి మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు



భీమనపల్లి వడ్డిచెరువు వద్ద కళ్లంలో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతు

ఉప్పలగుప్తం: కొంతకాలంగా వ్యవసాయాన్నే నమ్ముకుని పంటలు సాగు చేసే కర్షకులకు కష్టనష్టాలు తప్పడం లేదు. ఒకప్పుడు వ్యవసాయం చేసి పంట పండిస్తే ఆ రైతు ఇంట్లో ఏడాదిపాటు సిరులు తాండవించేవి. ప్రస్తుతం వ్యవసాయమే ఆధారంగా చేసుకుని పంట పండించే రైతుకు ఆది నుంచి అవస్థలు ఎదురవుతున్నాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కక పోగా నష్టాల బారిన పడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు.

సమస్యలతో రైతులు ఉక్కిరిబిక్కిరి

ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు చేపట్టిన రైతులు ముంపు సమస్యలతో, వర్షాలతో భారీ నష్టాల పాలయ్యారు. ముందస్తు రబీ సాగు చేపట్టి రబీ సాగు చేద్దామని నిర్ణయించుకున్న రైతులకు నారు సమయంలో వర్షాలు కురిసి డ్రెయిన్లలో నీరు దిగక నారుమడులు దెబ్బతిన్నాయి. మరొక పక్క విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకెత్తక, పంట సమయంలో సాగునీరు పూర్తిస్థాయిలో అందక ఇంజన్లతో తోడుకుంటూ పంటను కాపాడుకున్నారు. అతి వృష్టి లేదా అనావృష్టితో అన్నదాతలు ఏటా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ప్రభుత్వ సహకారం కరువు

ఎట్టకేలకు రబీ పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చినప్పటికీ, తీరా ధాన్యం చేతికొచ్చే సరికి ప్రభుత్వ సహకారం కొరవడి రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలో జాప్యం చేయడంతో అనధికారకంగా దళారుల చేతికి పంటను తక్కువ ధరకు అప్పగించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో దళారులు చెప్పిన ధరకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సరైన మద్దతు ధర దక్కుతుందని ధాన్యాన్ని కళ్లాల్లోనే నిల్వ చేస్తున్నామని, హఠాత్తుగా వాతావరణ మార్పుల కారణంగా వర్షం బారి నుంచి ,ధాన్యాన్ని కాపాడుకోవడానికి కంటి మీద కునుకులేకుండా కష్టపడున్నామని రైతులు తెలిపారు.

దళారుల చేతికి ధాన్యం

అమలాపురం నియోజకవర్గంలో ఉన్న అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో 15,280 ఎకరాల్లో రబీ సాగు చేపట్టారు. ఇప్పటి వరకూ 12,390 ఎకరాల్లో రబీ కోతలు పూర్తి చేసుకుని రైతులు ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచారు. నియోజకవర్గం వ్యాప్తంగా 49,522 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం కొంతమేర ధాన్యం కొనుగోలు చేస్తూ, మిగతా ధాన్యాన్ని అనధికారికంగా దళారుల చేతిలోకి వెళుతోంది.అమలాపురం మండలంలో 4,300 మెట్రిక్ టన్నులు, అల్లవరం మండలంలో 1,800 మెట్రిక్ టన్నులు, ఉప్పలగుప్తం మండలంలో 2,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం అధికారికంగా సేకరించింది. మిగతా ధాన్యం కొంత మేర దళారుల వద్దకు చేరింది. మరికొంత ధాన్యం కళ్లాల్లో ఉంది.

అక్కరకు రాని రైతు సేవా కేంద్రం సేవలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట పండించిన రైతు స్థానికంగా ఉన్న ఆర్‌బీకేలో సమాచారం అందిస్తే కొనుగోలు కేంద్రం సిబ్బంది రైతు మకాంలోకి వెళ్లి తేమ శాతాన్ని పరిశీలించేవారు. రెవెన్యూ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ, పీఏసీఎస్ సిబ్బంది అంతాకలసి ఆ ధాన్యాన్ని మిల్లుకు పంపే పూర్తి బాధ్యతను తీసుకునేవారు. రైతుకు ప్రభుత్వం నుంచి నగదు జమ చేసే వరకూ వారు జవాబుదారీగా ఉండేవారు. ఈ పరిస్థితుల్లో రైతులను దోచుకుంటున్న దళారీ వ్యవస్థకు గత ప్రభుత్వం పూర్తిగా చెక్ పెట్టింది. ప్రస్తుత పరిస్థితుల్లో పండించుకున్న ధాన్యాన్ని కొనుగోలు నిర్వహించమని రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి సమాచారం అందిస్తుంటే, వారు మిల్లు వద్దకు వెళ్లి వారితో ధర ఒప్పందం చేసుకుంటే ఆన్‌లైన్ చేస్తామని, నేరుగా ధాన్యాన్ని సేకరించమని సిబ్బంది జవాబిస్తున్నారని రైతులు తెలిపారు. సముద్ర తీర ప్రాంతాలైన ఉప్పలగుప్తం , అల్లవరం, అమలాపురం మండలాల్లో వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుదని, అధిక దిగుబడులు వస్తుందన్న ఆశతో రైతులు 60 శాతం బొండాల సాగును రైతులు చేపట్టారు. ప్రభుత్వం అధికారికంగా రూ.1,725 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, మార్కెట్‌లో టాటా బొండాలు రకాన్ని రూ.1,500, నాటు బొండాలు 2636 రకపు ఆరుదల ధాన్యాలను రూ.1,550 చెల్లించి దళారులు కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం సాకుచూపి ధాన్యాన్ని రూ.1,100 నుంచి రూ.1,300 చెల్లించి దళారులు దోచుకుంటున్నారని రైతులు అన్నారు. హమాలీ, రవాణా చార్జీలు అదనంగా భరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దళారులు 75 కిలోల బస్తాకు అదనంగా 5 కిలోల ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. దీని వెనుక ప్రభుత్వ అధికారుల అండ ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనడం లేదు



రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనడం లేదు. స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి సిబ్బందికి సమాచారం అందిస్తే మిల్లర్లను కలసి ధర నిర్ధారణ చేసుకుని మిల్లును ఎంచుకుంటే అప్పుడు కొనుగోలు చేస్తామని చెప్తున్నారు. ఇదే అవకాశంగా దళారులు అయినకాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– కోలపల్లి పట్టాభిరాముడు, రైతు, భీమనపల్లి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరిస్తున్నాం



రబీ ధాన్యాన్ని సిబ్బంది కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా మొదటి విడతగా 3,700 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం నిర్ణయించడంతో ఆమేరకు సేకరించాం. అదనంగా మరో 3,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ఉన్నతాధికారులను కోరాం. రైతులు మాకు సమాచారం అందిస్తే వారికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

–జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం మండలం

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



ఎన్.కొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మహిళలకు సమాజంలో అధిక ప్రాధాన్యత కల్పించే విధంగా రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన ఘనత అంబేడ్కర్‌దే అని అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి కొంకివారిపేటలో శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవ సమావేశంలో ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌తో కలసి పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకుని అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే సూరిబాబు, నడింపల్లి వాసురాజు, అంగాని సాంబశివరావు, కుంచే చిన్నీ, మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, కొంకి బాలకృష్ణ, కొంకి రాంబాబు, యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్. జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మోటూరి సత్యంకాపు, కుచ్చర్లపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

అమరవీరుడు మురళీ నాయక్‌కు ఘన నివాళులు



అమలాపురం కలెక్టరేట్ వద్ద మురళీ నాయక్‌కు సెల్యూట్ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు



ర్యాలీలో పాల్గొన్న మల్లాడి తదితరులు

అమలాపురం రూరల్: భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌తో పోరాడి వీర మరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్‌కు అమలాపురంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సెల్యూట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి సైనికులకు సంఘీభావం తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు జిల్లా అధ్యక్షురాలు మమత జ్యోతి మాట్లాడుతూ పాకిస్తాన్ కాల్పుల్లో సైనికుడు మురళీ నాయక్ మరణించడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లావర్కింగ్ అధ్యక్షుడు సాయి శంకర్, జిల్లా కార్యదర్శి, కె.సాయి తేజ, బీశివ, జిల్లా ఉపాధ్యక్షుడు టీ.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ

యానాం: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శత్రువులపై ఆపరేషన్ సిందూర్ ద్వారా వీరోచిత పోరాటం సాగిస్తున్న భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో అశువులు బాసిన సైనికులకు నివాళులర్పిస్తూ వారి త్యాగాలు చిరస్మరణీయమైనవన్నారు. వందలాది మంది యువకులు, మహిళలు సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తూ బాలయోగి స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పరీక్షల ఉత్తీర్ణతలో దస్తూరి కీలక పాత్ర



ఉపాధ్యాయుడు బాలకృష్ణను సత్కరిస్తున్న ఘన సత్యనారాయణ, విద్యార్థులు

అమలాపురం టౌన్: పరీక్షల్లో విద్యార్థి దస్తూరి (చేతి రాత) ఉత్తీర్ణతలో కీలక పాత్ర పోషిస్తుందని అమలాపురం పట్టణం కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ అన్నారు. పాఠశాల విద్యార్థులకు బెస్ట్ హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణనిచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కృతజ్ఞతాపూర్వక సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలకృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, జిల్లా ఉత్తమ కాలిగ్రాఫర్ అవార్డులు సాధించారని సత్యనారాయణ గుర్తు చేశారు. పాఠశాలలో నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బాలకృష్ణ చేతి రాత మెరుగయ్యేందుకు మెళకువలు వివరించారని చెప్పారు. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషాకు కూడా సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలకృష్ణను పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, డి.నాగేంద్రరాజు, ఆర్. వసంత పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి



దేవగుప్తంలో పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

అల్లవరం: మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతిని దేవగుప్తంలో మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవగుప్తంలోని ఆయన నివాసంలో పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.సత్తిబాబురాజు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, తిక్కా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు. బోడసకుర్రు కంసాలమామిడిలో పీవీ రావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోసుగంటి దుర్గారావు, సాపే ధర్మరాజు, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: దివంగత పీవీరావు 73వ జయంతిని శనివారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బుద్ధపార్కులో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు తదితరులు పాల్నొన్నారు.

డీఎస్సీలో ఉర్దూ పోస్టులు భర్తీ చేయాలి



పి.గన్నవరంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పి.గన్నవరం: డీఎస్సీ 2025లో ఉర్దూ ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ శనివారం పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఉమ్మడి జిల్లా ముస్లిం, మైనార్టీ ఉర్దూ డీఎస్సీ అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. ఏడేళ్ల నుంచి ఈ పోస్టుల కోసం వేలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని వారు వివరించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ప్రకటించిన 1241 పోస్టుల్లో ఒక్క పోస్టు కూడా ఉర్దూకి కేటాయించలేదన్నారు. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఉర్దూ అభ్యర్థులు తీవ్ర నిరాశ చెంది, మానసిక ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో డీఎస్సీ ఉర్దూ అభ్యర్థులతో పాటు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు హాజీ ముకరం హుస్సేన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఎం.సుభాన్, షానవాజ్ హుస్సేన్, మజీద్‌ఖాన్, షబ్బీర్ హుస్సేన్ ఉన్నారు.

12 నుంచి సువార్త మహోత్సవాలు

అమలాపురం రూరల్: అమలాపురం మన్నా జూబ్లీ శాటిలైట్ వారి సువార్త మహోత్సవాలు మే 12,13,14 తేదీల్లో ప్రతిరోజు రాత్రి 6 నుంచి 10 గంటల వరకు అమలాపురం చల్లపల్లి రోడ్డులో పరంజ్యోతి స్కూల్ రెడ్ బ్రిడ్జ్ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్టు పాస్టర్ కార్ల్ – షారోన్ కొమానపల్లి తెలిపారు. పాస్టర్ జాషువా కొమానపల్లి మాట్లాడుతూ పలువురు పాస్టర్లు, దైవ జనులు ఈ సభల్లో పాల్గొని వాక్య సందేశం అందిస్తారని తెలిపారు.

నిస్వార్థ ప్రజాసేవలే లక్ష్యం

యానాం: నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని గొల్లపల్లి అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. యానాం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కనకాల రాజు,శివ, ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12,500 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆకుల లోవరాజు (31) రెండు రోజులు క్రితం నాగుల్లంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు తొడ భాగంలో మోకాలి కింది భాగంలో బాగా నలిగిపోయింది. ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఇంకా రెండు ఆపరేషన్లు చేయాలని డాక్టర్లు చెప్పారు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలోని లోవరాజు పిన్ని వెంకటలక్ష్మికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12,500 చెక్కును అందజేశారు.

14వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన ఆరోగ్య రక్షణకు గత ప్రభుత్వం నియమించిన సీహెచ్‌ఓలు చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ క్లినిక్) ఏర్పాటు చేసి అందులో మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా సేవలందిస్తున్న సీహెచ్‌ఓలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దీర్ఘకాలికంగా సమ్మె కొనసాగుతుంది. దీంతో గ్రామాల్లో వైద్యసేవలు కుంటుపడుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనివల్ల మండలంలోని అనేక గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు మూతబడ్డాయి.

వేంకటేశ్వరునికి వైభవంగా హనుమత్ వాహన సేవ



బండారులంకలో హనుమత్ వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి తీర్థ, కల్యాణ మహోత్సవాల సందర్భంగా శనివారం హనుమత్ వాహన సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన హనుమత్ వాహనంపై స్వామి,అమ్మవార్లను పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ భక్తుల గోవింద నామస్మరణతో ఊరేగించారు. పేరంటాళ్లు గడప గడపకూ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి దేవ దేవేరుల కల్యాణానికి ఆహ్వానించారు. తొలుత కాశిన ప్రసాద్, కేదారేశ్వరి దంపతులతో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 2వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు,బళ్ల సత్తిరాజు, పిల్లి పల్లపరాజు, బాసిన కళ్యాణ్ కుమార్, కొండా రవి పాల్గొన్నారు

వైభవంగా వేంకటేశ్వరుని రథోత్సవం



తాళ్లరేవులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త సుభాష్, కొత్త నాగేశ్వరరావు, గోకవరపు సుభాష్, నందికోళ్ల కుమార్, నున్న దత్తు పాల్గొన్నారు. పాతకోరంగిలో వేంచేసియున్న శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం పండిత సదస్యము నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, రాత్రి తెప్పోత్సవం, 13న రాత్రి శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని తెలిపారు.

వేసవి బడి... ఆనందాల ఒడి

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల వేసవి శిక్షణ తరగతులు ఆనందాల ఆటల జ్ఞాపకాల ఒడిగా విద్యార్థుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన డీఈఓ షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గత నెల 24 నుంచి ఈ నెల 10 వరకు వేసవి బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షత వహించగా డీఈఓ సలీంబాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి బడి కార్యక్రమం ఆటలతో పాటు చిత్రలేఖనం, కళలు, రేపటి తరగతికి కావలసిన విజ్ఞానం అందజేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందని డీఈఓ అభినందించారు. శిక్షణకు 93 మంది విద్యార్థులు హాజరు కాగా వారికి తరగతి వారీగా టెస్టులు నిర్వహించారు. ఆ విజేతలకు, అలాగే ఈ శిక్షణలో 17 రోజుల పాటు స్వచ్ఛందంగా వచ్చి విద్యార్థులకు ఆటపాటలతో విజ్ఞానాన్ని అందించిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఏఆర్‌వీ కృష్ణ (తెలుగు), కె.ధర్మరాజు (ఆంగ్లం), ఎస్.ప్రవీణ్ (హిందీ), డి.శ్రీకాంత్ (గణితం), బి.నారాయణరావు (భౌతిక శాస్త్రం), బి.శేషగిరిరావు, ఖాజా మొహిద్దీన్ (బయలాజికల్ సైన్స్)లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.లీలావతి, పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, కో ఆర్డినేటర్ బి.నారాయణరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్, సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గత నెల 10 తేదీ నుంచి శనివారం వరకూ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.